సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 29 । జూలై । 2024



దూకుడు!
వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అంబర్ కిషోర్ ఝా కొంత కాలంగా పాలనలో దూకుడుగా ముందుకు సాగుతున్నారు. - 10లో▸



వినియోగదారులకు రాజీలేని సేవలు - 10లో▸
విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి కన్జ్యూమర్ డెస్క్ ఏర్పాటు చేశారు.



వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంబీఏ ఫస్టియర్ పరీక్షలు
కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఎంబీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు వెల్లడించారు. ఆగస్టు 8, 13, 17, 20, 22 తేదీల్లో పరీక్షలుంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ పరీక్షల పూర్తి వివరాలను కేయూ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

టీయూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం



నూతనకంటి బాబు
అధ్యక్షుడు



దామెర భిక్షపతి
జనరల్ సెక్రటరీ

విద్యారణ్యపురి: హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నూతనకంటిబాబు, జనరల్ సెక్రటరీగా దామెర భిక్షపతి, గౌరవాధ్యక్షుడిగా కె.విజయపాల్‌రెడ్డి, సహాధ్యక్షులుగా బల్లా సతీశ్‌కుమార్, కొండ్రు మంజుల, కోశాధికారిగా పల్లకొండ వీరస్వామి, సంయుక్త కార్యదర్శులుగా మర్రిపెల్లి నాగభూషణం, గుగులోతు కిషన్, బి.సుమాదేవి, కార్యదర్శులుగా టి.వెంకటయ్య, కె.ఉదయ్‌కుమార్, బి.దేవానందం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.జితేందర్‌రెడ్డి, అకాడమిక్ కన్వీనర్‌గా హెచ్.లింగారావు ఎన్నికయ్యారు.

ప్రైవేట్ యాజమాన్యాల దిష్టిబొమ్మ దహనం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మొదటిగేట్ వద్ద ఏఐఎస్‌బీ, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఆయా సంఘాల బాధ్యులు హకీంనవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్ మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేశాయన్నారు. జూనియర్ కళాశాలలు విద్యావ్యాపారీకరణతో పాటు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక కళాశాలకు అనుమతి పొంది పలు బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకున్నాయని అలాంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఇంటర్ విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా కళాశాలలు నడిపితే బహిరంగ చర్చకు రావాలని అసోసియేషన్‌ను కోరారు. ఆయా సంఘాల బాధ్యులు రోహిత్, హర్షం చరణ్, భారత్, ప్రణయ్, దాసరి అఖిల్, అరిస్టాటిల్, సృజన్, మల్లేశ్, సాయి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వర్గీకరణ జాప్యం



హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో జాప్యం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్‌ఖన్నా అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిలోని జై భీం కార్యాలయంలో ఢిల్లీలో చేపట్టనున్న దీక్ష కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రాజేశ్ ఖన్నా మాట్లాడుతూ.. 2004 నుంచి అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేశాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని దుయ్యబట్టారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఢిల్లీలో దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్-టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెపోగుల ప్రశాంత్, నాయకులు భాస్కర్, సంజీవ్, మధు, జోసెఫ్, రూపస్, శ్రీకాంత్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తడిసి మోపెడు..

ఆగస్టు 1 నుంచి భూముల విలువ పెంపు!
- రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డ్యూటీ, డాక్యుమెంట్ చార్జీలు కూడా..
- 8.5 నుంచి 9 శాతానికి పెరిగే అవకాశం..
- సర్కారుకు పెరగనున్న ఆదాయం..
- క్రయవిక్రయదారులపై అదనపు భారం





రిజిస్ట్రేషన్లకు పోటెత్తిన భూక్రయవిక్రయదారులు

కాజీపేట అర్బన్ : భూముల క్రయవిక్రయదారుల్లో మార్కెట్ విలువ పెంపు భయం నెలకొంది. ఖజానాకు ఆదాయం పెంచుకోవడానికి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంపునకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా సంబంధిత శాఖలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల నుంచి మొదలు అటెండర్ స్థాయి వరకు ఇప్పటికే బదిలీలు చేపట్టింది. త్వరలో సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ (రిజిస్ట్రేషన్ శాఖ) బదిలీలకు సిద్ధమైంది.

జూన్ 14న సర్క్యులర్ జారీ..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెట్ వాల్యూ గైడ్ లైన్స్–1998 ప్రకారం భూమి విలువ పెంపునకు జూన్ 7వ తేదీన విధివిధానాలు వెల్లడించిన రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ.. ఇందుకు సంబంధించి జీఓ 211 ప్రకారం జూన్ 14న సర్క్యులర్ జారీ చేసింది. డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్‌తో కూడిన ప్రత్యేక కమిటీ సబ్ రిజిస్ట్రార్లు స్థానికత ఆధారంగా మార్కెట్ విలువ పెంపునకు జూన్ 18వ తేదీ నుంచి కసరత్తు ప్రారంభించి 23వ తేదీన నివేదిక సమర్పించారు. కాగా, కమిటీ సమావేశాలు నిర్వహించి.. నివేదికకు అంగీకారం తెలిపి.. జూలై 24న మార్పులను ఖరారు చేసి.. జూలై 31న సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచి.. ఆగస్టు 1 నుంచి భూమి మార్కెట్ విలువ పెంపునకు ఇప్పటికే సిద్ధమయ్యారు.

ఫీజులు పెరిగే అవకాశం ఎంతంటే..

రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ 2021 జూలైలో రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డ్యూటీ, డాక్యుమెంట్ చార్జీలు కలిపి 4 శాతం ఉండగా.. 2022 ఫిబ్రవరిలో భూమి విలువ పెంచుతూ.. దానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డ్యూటీ 7.5 శాతానికి పెంచారు. ప్రస్తుతం భూమి మార్కెట్ విలువను 40 నుంచి 50 శాతం పెంచడానికి ఉత్తర్వులు రాగా.. ఆ మేరకు రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డ్యూటీ, డాక్యుమెంట్ చార్జీలు 8.5 శాతం నుంచి 9 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.

జోరందుకున్న రిజిస్ట్రేషన్లు..

మార్కెట్ విలువ పెరుగుతుందనే ముందస్తు సమాచారంతో భూక్రయవిక్రయదారులు అధిక రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి తప్పించుకునేందుకు గురు, శుక్ర, శనివారాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగడంతో ఖజానాకు ఆదాయం భారీగా సమకూరింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 15 రోజులుగా సుమారు 8,616 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా.. రూ. 28.25 కోట్ల ఆదాయం వచ్చింది.

భూముల ధరలు ఇలా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం అత్యధికంగా భూమి మార్కెట్ విలువ హనుమకొండ చౌరస్తాలో గజానికి రూ.46 వేలు ఉంది. విలువ పెంపుతో మార్పులతో రూ.75 వేల నుంచి రూ.80 వేలకు చేరనుంది. అత్యల్పంగా మడిపల్లి, అమ్మవారిపేట గ్రామాల్లో గజానికి రూ.700 ఉండగా.. అది రూ.1,000 నుంచి రూ.1,200 వరకు పెరగనుంది.

ఇక అపార్ట్‌మెంట్ల విషయానికి వస్తే.. స్క్వేర్ ఫీట్‌కు రూ.2,300 నుంచి రూ.3,500 పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ భూమి ప్రస్తుతం ఎకరానికి ధర రూ.1.35 కోట్లు ఉండగా రూ.1.80 కోట్లకు పెంచే అవకాశం ఉంది.

వరంగల్ ఆర్వోలో రికార్డు రిజిస్ట్రేషన్లు..

వరంగల్ ఆర్వోలో గురువారం 246 దస్తావేజులకు రూ.1.90 కోట్ల ఆదాయం వచ్చింది. శుక్రవారం 229 దస్తావేజులకు రూ.1.20 కోట్లు, శనివారం 220 దస్తావేజులకు రూ.1.కోట్ల ఆదాయం వచ్చింది.

అధికారులకు నివేదిక ఇచ్చాం..

> భూమి మార్కెట్ విలువ పెంపును స్థానికత ఆధారంగా చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. భూక్రయవిక్రయదారులు మార్కెట్ విలువ పెరుగుతుందనే ఆలోచనలతో ముందస్తుగా రిజిస్ట్రేషన్లకు పోటీపడుతున్నారు. దీంతో మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లు పెరిగాయి. వచ్చిన ప్రతి దస్తావేజుకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశాం.
>
> – రాజు, సబ్ రిజిస్ట్రార్, వరంగల్ ఆర్వో

తిష్టవేసిన ఉద్యోగులకు స్థాన చలనం

- తప్పుడు పత్రాలపై విజిలెన్స్ విచారణ
- 'సాక్షి' కథనంపై స్పందించిన ప్రభుత్వం



22వ తేదీన 'సాక్షి'లో వచ్చిన కథనం

వరంగల్: వైద్యశాఖలో జరిగిన బదిలీల్లో ఆఫీసు బేరర్ల పేరుతో తప్పుడు పత్రాలు సమర్పించి ట్రాన్స్‌ఫర్ తప్పించుకుని అదే స్థానంలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేసిన ఉద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి. వైద్యశాఖ వరంగల్ జిల్లా పరిధి ఉద్యోగుల బదిలీల్లో జరిగిన అవకతవకలపై 'వైద్యశాఖ బదిలీల్లో అక్రమాలు' శీర్షికన ఈనెల 22న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విజిలెన్స్ శాఖతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించడంతో అక్రమాలు వాస్తవమేనని తేలింది. దీంతో ఆ బదిలీలను రద్దు చేసి కొత్తగా శనివారం రాత్రి ఆన్‌లైన్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. యూనియన్ నాయకుల పేరుతో పట్టణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా తిష్టవేసి బదిలీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఉద్యోగులను గ్రామీణ ప్రాంతాలకు పంపించింది. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించడంతో పైరవీలు లేకుండా ఎక్కడ వస్తే అక్కడకు వెళ్దామని అనుకున్న ఉద్యోగులకు ఫోకల్ పాయింట్లలో పోస్టింగ్ రావడంతో సంతోష పడుతున్నారు. అయితే ఇదే కౌన్సెలింగ్ నిబంధన ప్రకారం ఆప్షన్ ఇచ్చిన చోట కాకుండా ఇతర ప్రాంతానికి బదిలీ ఉత్తర్వులు వచ్చిన వారు తీవ్ర నిరాశలకు లోనవుతున్నారు. ఇలా ఎందుకు జరిగిందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. బదిలీల్లో ఎదురుదెబ్బ తగిలిన ఉద్యోగులతో పాటు ఆప్షన్ ఇచ్చినా ఇతర చోట పోస్టింగ్ పొందిన ఉద్యోగులు కలసి డీహెచ్ కార్యాలయానికి వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. అవసరమైతే కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ఆకట్టుకుంటున్న 'సురభి' ప్రదర్శనలు



మాయాబజార్ నాటక ప్రదర్శన

హన్మకొండ కల్చరల్: భానోదయ నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురభి నాటక ప్రదర్శనలు నగర ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సురభి 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ కలెక్టర్, వరంగల్ మహానగర పురపాలక సంఘం సహకారంతో జరుగుతున్న సురభి నాటక ప్రదర్శనల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం మాయాబజార్ నాటక ప్రదర్శన ప్రేక్షకుల్ని అలరించింది. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ కళాకారులు, జిల్లా రంగస్థల పద్యనాటక పరిషత్ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి రూ.5 వేలు కళాకారులకు ఆర్థికసాయం అందజేశారు. సీనియర్ కళాకారులు కళారాజేశ్వర్‌రావు ప్రతీరోజు ప్రదర్శించే నాటకాల్లో ప్రతిభ చూపిన కళాకారులకు నిర్వహించే సన్మాన కార్యక్రమంలో భాగంగా ఘటోత్కచుడి పాత్రధారి జయరాంప్రసాద్‌కు వెయ్యి నూటపదహార్లు బహుమతిగా అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, పుష్పలత, రేకందర్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యపర్చేది రచయితలే..

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



పుస్తకం ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నయీంనగర్: సమాజాన్ని చైతన్యపర్చేది రచయితలు, మేధావులేనని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విశ్రాంత అధికారి డాక్టర్ కాయిత వెంకటి రచించిన 'నేను–నా జీవన ప్రస్థానం' పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వడ్డేపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు జరుగుతున్న డ్రాఫ్టులు రాస్తారని, కవులు మాత్రం జరిగిపోయింది.. జరిగేది.. జరగబోయేది తమ ఊహా శక్తితో రాస్తారని వివరించారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని కాయిత వెంకటి నిరూపించారని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, డాక్టర్ గిరిజామనోహర్‌బాబు, రమాదేవి, డాక్టర్ వి.నాగేశ్వర్‌రావు, అరసం అధ్యక్షుడు డాక్టర్ పి.వీరస్వామి, కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, వెంకటయ్య, ఎస్.హరినాథరావు, రచయిత కాయిత వెంకటి దంపతులు, కుటుంబసభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం..

హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జర్నలిస్టు నాయకులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని, ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి పెంచాలని సూచించారు. అలాగే అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు ఇవ్వడానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నాయకులు గాడిపల్లి మధు, తోట సుధాకర్, రాంచందర్, దుర్గాప్రసాద్, కంకణాల సంతోశ్, పి.వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

నీటిలో రాతికోట ఉత్తర ముఖద్వారం



ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలావరంగల్ రాతికోట ఉత్తర ముఖద్వారం నీటిలో మునిగింది. కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఉత్తర ద్వారానికి ఈ దుస్థితి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో దేదీప్యమైన వెలుగులో ఉత్తర ద్వారం కనిపించాలని ఆరునెలల క్రితం ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు నేడు నీటిలో మునిగి భారీనష్టం వాటిల్లిందని టెక్నీషియన్లు చెబుతున్నారు. వర్షాకాలం ముందే ఉత్తర ద్వారం వద్ద మొరం పోసి చదును చేసి ఉంటే ద్వారం నీటిలో ఉండేది కాదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర పురావస్తుశాఖ అధికారులు పర్యటించి రాతికోట ఉత్తర ముఖద్వారం వద్ద మొరం పోసి చదును చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెండో జత యూనిఫామ్ సిద్ధం

ఈనెలాఖరులోగా పూర్తికానున్న స్టిచింగ్
- విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారుల సన్నాహాలు
- మొదటి జతకు సంబంధించిన కుట్టు నిధుల విడుదల
- హెచ్‌ఎంల డిక్లరేషన్‌తో త్వరలో ఎస్‌హెచ్‌జీలకు చెల్లింపు



విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో జత యూనిఫాం సిద్ధమవుతోంది. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం తర్వాత విద్యార్థులకు ఒక్కో జత చొప్పున పంపిణీ చేశారు. టెస్కో నుంచి వచ్చిన క్లాత్‌ను మండల సమాఖ్యల ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కుట్టించారు. రెండో జత యూనిఫాం కోసం టెస్కో నుంచి క్లాత్ జూన్ నెలలోనే వచ్చింది. కాగా, కొన్ని చోట్ల కుట్టుడు పూర్తికాగా, మరికొన్ని చోట్ల కుట్టుడు కొనసాగుతోంది. ఈనెలాఖరులోగా కుట్టుడు పూర్తయిన తర్వాత విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. యూనిఫాం కుట్టించే ప్రక్రియను ఆగస్టు 15 వరకు పూర్తిచేయాలనే యోచనలో డీఆర్‌డీఏ ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యార్థుల కొలతల ప్రకారమే..

ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని 12వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు దుస్తులు కుట్టించేందుకు గతంలో వారి కొలతలు తీసుకున్నారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజు ఒక జత చొప్పున పంపిణీ చేశారు. కొలతల్లో తేడా ఉంటే మళ్లీ విద్యార్థుల కొలతలను తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

కమిటీల ఏర్పాటు..

డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని మండల సమాఖ్యలు, టౌన్ లెవల్ ఫెడరేషన్స్ ద్వారా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు యూనిఫాం కుట్టించే బాధ్యతలు అప్పగించారు. ఇందుకోసం కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీలో మండలస్థాయి స్పెషల్ ఆఫీసర్, ఎంఈఓ/ఎంఎన్‌ఓ, ఏపీఎం (డీఆర్‌డీఏ) సభ్యులుగా ఉన్నారు. వీరు హెచ్‌ఎంల సమక్షంలో రెండో జత యూనిఫాం కుట్టిస్తున్నారు.

మొదటి జత స్టిచింగ్ నిధులు విడుదల..

ఒక్కో జత యూనిఫాం కుట్టేందుకు రూ.50 చొప్పున చెల్లించేందుకు ఇటీవల జిల్లాలకు సమగ్ర శిక్ష ద్వారా నిధులు మంజూరయ్యాయి. త్వరలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చార్జీలు చెల్లించనున్నారు.

అయితే, కుట్టు కూలి రూ.75కు పెంచినట్లు ఇటీవల ప్రభుత్వం నుంచి జిల్లా విద్యాశాఖాధికారులకు ప్రొసీడింగ్ వచ్చినట్లు సమాచారం. కానీ, తొలుత ఒక జతకు రూ.50 చొప్పునే నిధులు మంజూరయ్యాయి. ఈనెల 25న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఒక్కో జతకు రూ.75 చెల్లిస్తామని ఆర్థిక శాఖమంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కూడా ప్రకటించారు.

హెచ్‌ఎం డిక్లరేషన్‌తో నిధుల విడుదల

మంజూరైన యూనిఫాం కుట్టుకూలి నిధులు విడుదల చేసేందుకు ఆయా పాఠశాలలకు యూనిఫాం వచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు డిక్లరేషన్ ఇవ్వాలని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వారు డిక్లరేషన్ ఇవ్వగానే మండల సమాఖ్యల ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ఒక్కో జతకు రూ.50 చొప్పున చెల్లించనున్నారు. అయితే, డిక్లరేషన్ కొందరు ఇవ్వగా, మరికొందరు ఇవ్వాల్సి ఉందని సమాచారం. ఇదిలా ఉండగా కుట్టుకూలి ఒక్కో జతకు రూ.50 నుంచి రూ.75 పెంచిన నేపథ్యంలో.. మిగిలిన కుట్టుకూలి ఎప్పుడు ఇస్తారనేది స్పష్టతలేదు. రెండోజత యూనిఫాం పంపిణీ చేసిన తర్వాత ఇస్తారని భావిస్తున్నారు.

జిల్లాల వారీగా స్కూళ్లు, విద్యార్థులు, స్టిచింగ్ నిధుల వివరాలు..

జిల్లా	స్కూళ్లు	విద్యార్థులు	నిధులు
హనుమకొండ	488	34,161	రూ. 16,38,350
వరంగల్	565	36,521	రూ. 18,26,050
జనగామ	474	31,422	రూ. 15,70,600
భూపాలపల్లి	421	20,358	రూ. 10,17,900
ములుగు	417	18,020	రూ. 9,73,000
మహబూబాబాద్	868	46,298	రూ. 23,14,900

పందులతో పరేషాన్..

పేదల కాలనీల్లో సంచారం
- రోగాల పాలవుతున్న జనం
- ఉపాధి కల్పించినా నగరాన్ని వీడని పెంపకందారులు
- పట్టించుకోని గ్రేటర్ పాలక, అధికార వర్గాలు



నగరంలో సంచరిస్తున్న పందులు

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో పందుల బెడద ఎక్కువైంది. జనావాసాల్లో సంచరిస్తూ వ్యాధుల్ని వ్యాపింపజేస్తున్నాయి. పందులతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా.. అవి జనంపై దాడులు చేస్తున్నా.. పాలకులు, అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా ప్రత్యేక స్థలాల్లో పందులు పెంచుకోవాల్సి ఉండగా.. నగరంలోని పలు వీధుల్లో, ఇళ్ల మధ్యలో వదిలేస్తున్నారు. దీంతో చెత్త కుప్పలు, మురుగు కాల్వల్లో అవి సంచరిస్తున్నాయి. వాటి కారణంగా దోమలు విజృంభించి ప్రజలు వ్యాధులబారి న పడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. బల్దియా ప్రజారోగ్య విభాగం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మురికివాడల కాలనీల్లోని ప్రజలు పందులతో అనేక బాధలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత బస్తీల్లో..

బల్దియాలోని పాత బస్తీల్లో రోడ్లపై, జనావాసాల్లో పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఊరికి దూరంగా పెంచుకోవాలనే నిబంధన ఉన్నప్పటికీ పెంపకందారులు పట్టించుకోవడం లేదు. వరంగల్‌లోని చింతల్, లేబర్ కాలనీ, క్రిస్టియన్ కాలనీ, చెన్నారెడ్డి కాలనీ, గరీబ్ నగర్, కాశిబుగ్గ, ఎల్బీనగర్, దేశాయిపేట, తుమ్మలకుంట, అండర్ రైల్వే గేట్‌లోని సాకరాశికుంట, కాశికుంట, ఖిలా వరంగల్, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, శివనగర్, ఏసి రెడ్డి నగర్, హనుమకొండలోని పెద్దమ్మగడ్డ, పద్మాక్షి కాలనీ, న్యూశాయంపేట, సమ్మయ్య నగర్, సోమిడి, జూబ్లీ మార్కెట్‌తోపాటు పలు కాలనీల్లో పందులు సంచరిస్తున్నాయి.

60 మందికి ఉపాధి కల్పించినప్పటికీ..

తమ జీవనోపాధిని బల్దియా అధికారులు నాశనం చేస్తున్నారంటూ.. అధికారులపై పందుల పెంపకందారులు గతంలో తిరగబడ్డారు. దీంతో అప్పటి కమిషనర్ పమేలా సత్పతి 60 మంది పందుల పెంపకందారులకు పారిశుద్ధ్య కార్మికులుగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉపాధి కల్పించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం వారంతా ఉపాధి పొందుతున్నారు. అయినప్పటికీ నగరానికి పందుల బెడద మాత్రం తగ్గలేదు. బల్దియా ప్రజారోగ్యం విభాగాధికారులు, సిబ్బంది పందుల తరలింపుపై దృష్టిపెట్టకపోవడంపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ప్రకటనలకే పరిమితమవుతుండడంతో ఫలితం కనిపించట్లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పందుల పెంపకాన్ని అడ్డుకునే పరిస్థితి కనిపించడం లేదు. పందుల కారణంగా ఆకర్షణీయ నగరం కాస్త.. అగ్లీ నగరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం..

> పందుల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నామని పలువురు పెంపకందార్ల విజ్ఞప్తి మేరకు ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గతంలో ఉపాధి కల్పించాం. కొంతమంది పందులను పెంచుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.
>
> – రాజేశ్, బల్దియా సీఎంహెచ్ఓ

బస్సులను కండీషన్‌లో ఉంచాలి



మెకానిక్‌ను సన్మానిస్తున్న డీఎం మోహన్‌రావు

హన్మకొండ: బస్సులను కండీషన్‌గా ఉంచాలని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు అన్నారు. మెయింటనెన్స్ డేలో భాగంగా ఆదివారం ఆర్టీసీ వరంగల్–1 డిపోలో డీఎం అదాలత్ నిర్వహించి డ్రైవర్లు, మెకానిక్‌లతో ముఖాముఖి చర్చించారు. బస్సుల కండీషన్‌పై లోపాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు గ్రహించిన లోపాల్ని వెంటనే డిపోలో తెలిపితే పరిశీలించి మెకానిక్‌లు మరమ్మతు చేయాలని సూచించారు. అనంతరం గ్యారేజీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెకానిక్ ఎండీ.మోహీనుద్దీన్, ఎలక్ట్రీషియన్ సి.హెచ్.శివప్రసాద్‌ను సన్మానించారు. అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

పని చేయాలని భార్య మందలింపు..

● మనస్తాపంతో భర్త ఆత్మహత్య
● ముడుపుగల్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : 'ఏం పని చేయకుండా ఖాళీగా ఉంటున్నావు.. పని చేయకుంటే కుటుంబం ఎలా గడుస్తది' అని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో జరిగింది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నలమాస నాగేశ్వర రావు (50) కొంత కాలంగా ఏం పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఎందుకు ఖాళీగా ఉంటున్నావు.. ఏదైనా పనిచేస్తే బాగుంటుంది కదా అని భార్య పద్మ మందలించింది. దీనికి మనస్తాపానికి గురైన నాగేశ్వర రావు.. శనివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

క్షణికావేశంలో యువకుడు..


శ్రీనివాస్(ఫైల్)

గార్ల: దంపతుల మధ్య జరిగిన గొడవలో క్షణికావేశానికి గురైన ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చవిటి తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గార్ల మండలం చిన్న బంజర గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస్(23)కు సేరిపురం జీపీ పరిధి చవిటితండాకు చెందిన సుమతితో 5 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. శ్రీనివాస్ అత్తగారి ఇంటి వద్దే ఉంటూ కూలీ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ దంపతులకు 3 సంవత్సరాల కూతురు ఉంది. ఈ క్రమంలో బైక్ ఫైనాన్స్ కిస్తీ కట్టమని సుమతి డబ్బులు ఇవ్వగా శ్రీనివాస్ కట్టకుండా జల్సాలకు వినియోగించుకోగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన శ్రీనివాస్ ఈనెల 25న గార్ల సమీపం అప్పసముద్రం చెరువు వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాటసారులు చూసి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని హుటాహుటిన మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈఘటనపై మృతుడి సోదరుడు హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

చింతల్‌లో మహిళ..

ఖిలా వరంగల్: చేతికందిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన శనివారం రాత్రి చింతల్ పోచమ్మ టెంపుల సమీపాన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చింతల్‌కు చెందిన గీతారాణి కుమారుడు శివకిరణ్ (18) డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించలేకపోయానని ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మృతి చెందిన నాటి నుంచి గీతారాణి మనస్తాపం చెందుతోంది. ఈక్రమంలో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతు రాలి తండ్రి జక్కుల సదయ్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై జనగామలో విద్యార్థులకు వివరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా (ఫైల్)



కాజీపేట రైల్వేస్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఇతర అధికారులు (ఫైల్)



దూకుడు!

పాలనలో స్పీడ్ పెంచిన సీపీ అంబర్ కిషోర్ ఝా

● వరంగల్ పోలీస్ కమిషనరేట్‌పై పూర్తిస్థాయి పట్టు
● సమస్యలపై నజర్.. మత్తు పదార్థాలపై ఉక్కుపాదం
● ప్రజావాణి ఫిర్యాదులపై సెల్ ఏర్పాటు
● సిబ్బంది సంక్షేమంపై శ్రద్ధ


వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అంబర్ కిషోర్ ఝా.. కొంతకాలంగా పాలనలో దూకుడుగా ముందుకు సాగుతున్నారు. గతేడాది రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అనూహ్యంగా బదిలీపై వచ్చిన అంబర్ కిషోర్ ఝా ఎన్నికల తర్వాత బదిలీ అవుతారనే ప్రచారం సాగింది. పార్లమెంట్ ఎన్నికల తరువాత బదిలీ తప్పదు అనే ప్రచారం జోరుగా సాగింది. కానీ ఎవరూ ఊహించని విధంగా బదిలీ జరగకుండా, పోస్టింగ్ పక్కాగా ఇక్కడే అన్నది స్పష్టమైంది. దీంతో ఆయన పాలనపై పట్టు బిగించారు. ఈక్రమంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, బాధితులకు జరుగుతున్న న్యాయం, చీకటి వ్యాపారాలపై మోపుతున్న ఉక్కుపాదం తదితర అంశాలు కమిషనరేట్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి.

పాలనపై పట్టు

మొదట మిస్టర్‌కూల్‌గా ఉన్న సీపీ.. ఆ తరువాత అదే తీరుతో ఉంటూ మరోవైపు పాలనపై పట్టు బిగించారు. పోలీస్ అధికారులు, సిబ్బందిపై ఎక్కడైనా ఆరోపణలు వస్తే వెంటనే ఎస్‌బీ విచారణ జరిపించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ పని కూడా పోలీస్ అధికారులు చేయొద్దని పదే పదే హెచ్చరిస్తున్నారు. విచారణలో వాస్తవమని తేలితే వెంటనే శాఖాపరమైన చర్యలు చేపడుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక సెల్

వివిధ రకాల సమస్యల పరిష్కారానికి బాధితులు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వస్తున్నారు. వారికోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ప్రతీరోజు 30 నుంచి 40 మంది బాధితులు నేరుగా సీపీతో మాట్లాడుతున్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ఒక ఏసీపీ స్థాయి అధికారి, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను ప్రత్యేకంగా కేటాయించారు. ప్రజావాణి వినతులతోపాటు ట్రిబుల్ సీ ఫిర్యాదులపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు.

టాస్క్‌ఫోర్స్‌తో సత్వర న్యాయం

ప్రత్యేకంగా సీపీ పర్యవేక్షణలో నడుస్తున్న టాస్క్‌ఫోర్స్‌తో బాధితులకు సత్వర న్యాయం జరుగుతోంది. అక్రమంగా సాగుతున్న చీకటి వ్యాపారాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఈ యేడాది జూన్ వరకు రూ.10.40 లక్షల విలువైన గుట్కాలు పట్టుకుని 27 కేసులు నమోదు చేసి 37 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న రూ.1.20 కోట్ల విలువైన 4,731 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. 27 కేసులు నమోదు చేసి 37 మందిని అరెస్ట్ చేశారు. ఇటీవల జరిగిన కానిస్టేబుళ్ల బదిలీల్లో ప్రతీ కానిస్టేబుల్‌తో నేరుగా మాట్లాడి బదిలీ చేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంప్రదాయ పోలీస్ విధానాలకు స్వస్తి పలుకుతూ.. ప్రజలకు మరింత చేరువ కావడానికి అధికారుల్లో, సిబ్బందిలో మార్పులు తీసుకొస్తున్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువత, విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు, కమిషనరేట్‌ను గంజాయి ఫ్రీగా మార్చేందుగా సీపీ .. డ్రగ్స్ కంట్రోల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఆర్‌ఐతోపాటు ముగ్గురు ఆర్‌ఎస్సైలను నియమించారు. విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల సమాచారాన్ని పోలీసులకు అందించడం కోసం 87125 84473 ఏర్పాటు చేశారు. గతేడాది అక్టోబర్ నుంచి ఈ యేడాది జూన్ వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రూ.2.88 కోట్ల విలువైన 1,134 కిలోల గంజాయిని పట్టుకుని, 66 కేసుల్లో 131 మంది నిందితులను జైలుకు తరలించారు.

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

ట్రైసిటీ పరిధిలో అర్ధరాత్రి ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఇటీవల సీపీ నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీంతో ప్రజలకు 'మేమున్నాం'అనే భరోసాను కల్పించారు. అర్ధరాత్రి తర్వాత రోడ్లపై తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో రాత్రి 11.30 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దీనివల్ల బాధితులకు మరింత న్యాయం జరుగుతుంది.

ట్రాఫిక్‌లో సమూల మార్పులు

ట్రైసిటీ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు జంక్షన్ల వద్ద సిగ్నల్స్ వ్యవస్థను పటిష్టం చేశారు. కాజీపేట జంక్షన్, ఫాతిమానగర్, ఫారెస్ట్ కార్యాలయం, హనుమకొండ కలెక్టరేట్, అమరవీరుల స్తూపం, సీపీఓ జంక్షన్, కాకతీయ యూనివర్సిటీ, అశోక జంక్షన్, ములుగురోడ్డు, ఎంజీఎం జంక్షన్, పోచమ్మ మైదాన్, వరంగల్ చౌరస్తా ఇలా ట్రైసిటీల పరిధి పలు జంక్షన్లలో అధునాతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మైనర్లు వాహనాలు నడపడంపై కన్నెర్ర..

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన సుమారు 36మంది మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడుతున్న వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో మార్పు తెస్తున్నారు.

బస్సుల కండీషన్‌పై ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ

● వినూత్న కార్యక్రమాల ద్వారా కండీషన్ మెరుగుకు కృషి
● డీఎం అదాలత్ ద్వారా లోపాల సవరణ



హన్మకొండ: బస్సుల కండీషన్‌పై టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రమాదాలు జరగకుండా ఉండడంలో బస్సు కండీషన్ కూడా ప్రధాన అంశం. డ్రైవర్ వైఫల్యంతోనే కాకుండా బస్సులు కండీషన్ లేకపోతే కూడా ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఈ క్రమంలో బస్సుల కండీషన్‌పై ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రమాదరహిత వారోత్సవాల్లో భాగంగా వినూత్న కార్యక్రమం చేపడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బస్సుల కండీషన్‌పై డ్రైవర్, మెకానిక్‌లు ఒకరిపై మరొకరు నిందించుకోకుండా ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డీఎం అదాలత్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ డీఎం అదాలత్‌లో డిపో మేనేజర్.. డ్రైవర్ నుంచి బస్సులో తలెత్తిన సమస్యలు, లోపాలను మెకానిక్ సమక్షంలో తెలుసుకుంటాడు. ఇక్కడ మెకానిక్ తప్పించుకునే అవకాశముండదు. డ్రైవర్ సూచించిన లోపాలను పరిశీలించి వాటిని మరమ్మతు చేయడం ద్వారా బస్సు కండీషన్‌ను మెరుగుపరుస్తారు. తద్వారా ప్రమాదాలను తగ్గించే అవకాశముంది. దీంతోపాటు ఇంధనం ఆదా అవుతుంది.

రోజూ 4 లక్షల మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు..

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో 9 డిపోల పరిధిలో 952 బస్సులు సేవలు అందిస్తున్నాయి. ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు 584 ఉండగా 368 అద్దె బస్సులున్నాయి. ఈ బస్సులు ప్రతి నెల 34 లక్షల నుంచి 39 లక్షల కిలో మీటర్లు తిరుగుతున్నాయి. రోజూ 4 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బస్సుల కండీషన్‌పై సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా డీఎం అదాలత్ ద్వారా బస్సుల కండీషన్ తెలుసుకుంటోంది.

సైబర్ మోసం..

● రూ. 2.30 లక్షలు మాయం
● ఇండియన్ బ్యాంక్ ఆఫ్ స్మార్ట్ యాప్ ద్వారా కాజేసిన నేరగాళ్లు

గంగారం: ఇండియన్ బ్యాంక్ ఆఫ్ స్మార్ట్ యాప్ ద్వారా ఓ వ్యక్తి అకౌంట్ నుంచి రూ. 2.30 లక్షలు మాయమయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పెద్ద ఎల్లాపురం గ్రామంలో జరిగింది. ఎస్సై రవి కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుండగాని శ్రీధర్ ఇండియన్ బ్యాంక్ ఆఫ్ పేరుతో ఆఫ్ స్మార్ట్ యాప్ అప్‌డేట్ చేసుకోవాలని మెసేజ్ రావడంతో సెల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేసి మీకు లోన్ ఇస్తామని మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుందని చెప్పగా శ్రీధర్ తిరస్కరించాడు. అయితే నాలుగు గంటల తర్వాత శ్రీధర్ అకౌంట్ నుంచి రూ.2.30లక్షలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఈ ఘటనపై బాధితుడు లబోదిమంటూ సైబర్ క్రైమ్ విభాగం, గంగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


రాజేశ్ (ఫైల్)

కమలాపూర్ : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో చోటు చేసుకుది. పోలీసుల కథనం ప్రకారం.. కమలాపూర్‌కు చెందిన మౌటం రాజేశ్ (26), మరో ఇద్దరు బండి రాంబాబు, బండి రమేశ్ స్థానిక పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో వల కాలికి చుట్టుకుని రాజేశ్ నీట మునిగాడు. ఇది గమనించిన రాంబాబు, రమేశ్ వెంటనే నీట మునిగిన రాజేశ్‌ను బయటకు తీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజేశ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య స్రవంతి, కుమారుడు సుశాంత్, కూతురు శ్రీవణ్య ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు..


చంద్రమ్మ (ఫైల్)

టేకుమట్ల: కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్(వి)లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆకునూరి చంద్రమ్మ(85) ఈ నెల 17న అర్ధరాత్రి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. దీంతో కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పూరిల్లు దగ్ధం



గోవిందరావుపేట: మండల పరిధిలోని మొద్దుల గూడెం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. పస్రా గ్రామ పంచాయతీ పరధిలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన పిట్టల నర్సయ్య తన కుటుంబంతో పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం యథావిధిగా నర్సయ్య, తన భార్య వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లారు. అప్పటికే కొద్ది రోజులుగా కరెంట్ రావడం, పోవడం, ఎక్కువ తక్కువ అవుతుందని బాధితుడు నర్సయ్య చుట్టుపక్కల వారితో చర్చించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో లో ఓల్టేజీ కారణాల వల్ల షార్ట్ సర్క్యూట్ జరగడంతో నిప్పులు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులకు మంటలు ఆర్పడం కష్టంగా మారింది. చుట్టుపక్కల వారు చూసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా.. ఫలితం లేదు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే నష్టం జరిగింది. వస్తువులు, నగదు, బంగారం, దుస్తులు, ఫ్రిడ్జ్, టీవీ, బైక్ అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధితులు కట్టు బట్టలతో మిగిలారు.

వినియోగదారులకు రాజీలేని సేవలు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కన్జ్యూమర్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి కన్జ్యూమర్ డెస్క్‌కు వచ్చే ఫిర్యాదులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. ఈ డెస్క్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీజీ ఎన్పీడీసీఎల్ జవాబుదారి తనంతో పని చేస్తుంది. మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రతి సర్కిల్, డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. వినియోగదారులు తమ అన్ని రకాల సమస్యల పరిష్కారానికి ఏదేనీ సర్కిల్, డివిజన్, సెక్షన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి రశీదు పొందవచ్చు. ఈ ఫిర్యాదులను అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారు. ఫిర్యాదులను డివిజనల్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ నుంచి ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని అధికారులు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూనే ఉంటారు. వినియోగదారుడు చేసిన ఫిర్యాదు పరిష్కరించిన తర్వాత సంతృప్తి చెందకపోతే మరోసారి ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కల్పించింది. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఫిర్యాదు అలాగే ఉంటుంది.


స్టోర్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ వెంకటరమణ, డీఈ విజేందర్ రెడ్డి

చిత్తశుద్ధితో ఉన్నాం



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సంస్థ చిత్తశుద్ధితో పనిచేస్తోంది. సమస్యలు పరిష్కారమయ్యే వరకు కన్జ్యూమర్ డెస్క్‌లో కనిపిస్తూ గుర్తు చేస్తూనే ఉంటుంది. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిచడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు పని చేస్తున్నారు.

- కె.వెంకటరమణ, ఎస్ఈ హనుమకొండ

రెండు జేసీబీలు, టిప్పర్ సీజ్

● డయల్ 100కు స్పందించిన పోలీసులు

ఐనవోలు: రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన సంఘటన మండలంలో పున్నేలు వడ్డెరగూడెం, లింగమోరిగూడెం గ్రామాల్లో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం డయల్ 100కు ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేసి లింగమోరిగూడెం, పున్నేలు శివారులోని వడ్డెరగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక, మొరం ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని తెలిపారు. దీంతో 100 డయల్ కాల్‌కు స్పందించాలని పోలీస్ కమిషనర్ ఆదేశాలు స్పష్టంగా ఉండటంతో హుటాహుటిన ఘటనా స్థలాలపై వేర్వేరుగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమాచారం ఇచ్చిన క్షణాల్లో ఎస్సై స్పందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి వివరాలు లభ్యం

● బీటెక్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య
● మృతదేహం తల్లిదండ్రులకు అప్పగింత

జనగామ: రెండు రోజుల క్రితం జనగామ జిల్లా కేంద్రం అంబేడ్కర్ నగర్ శివారులో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి వివరాలు లభ్యమయ్యాయి. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన ఏనుగు ఎల్లారెడ్డి కుమారుడు వాసుదేవరెడ్డి(19) మేడ్చల్ జిల్లా కొండలకోయ ఏరియాలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తుంటే.. ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుళ్లు సుదర్శన్, నరేశ్ ఆధ్వర్యంలో శవపంచనామా చేసి, పోస్టుమార్టం అనంత రం మృతదేహాన్ని కుటుంబీకులకు అందించారు.

'కులగణన చేసి మాట నిలుపుకోవాలి'

కాజీపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి మాట నిలబెట్టుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులగణన చేపట్టిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో బీసీలంతా ఒకతాటిపైకి వచ్చి వ్యతిరేకిస్తామన్నారు. కామారెడ్డిలో ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ సమక్షంలో చేసిన డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

గీసుకొండ: మండలంలోని వంచనగిరి పంచాయతీ కార్యదర్శి మురళిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రైతు రుణమాఫీకి సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు రైతుల నుంచి ఫిర్యాదు అందిన మేరకు విచారణ జరిపి అధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం.

ఎస్‌జీటీలకు పదోన్నతులు

● ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ
● మిగులు పోస్టుల్లో 257 మందికి అవకాశం

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగిలిన పోస్టుల్లో మరో 257 మంది సెకండ్ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)కు పీఎస్‌హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించబోతున్నారు. ఇటీవల ఎస్‌జీటీలకు ఆయా కేడర్‌లో పదోన్నతులు కల్పించాక పోస్టులు మిగిలాయి. ఇప్పటికే సీనియారిటీ జాబితాలను జిల్లాల వారీగా వెల్లడించారు. ఒక్కో పోస్టుకు ఒక్కరికే సీనియారిటీ జాబితాలో వెల్లడించి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది జాబితాలు ప్రకటించారు. శనివారం రాత్రినుంచి వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వగా.. ఆదివారం మధ్యాహ్నం వరకు ఇచ్చుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వెబ్‌ఆప్షన్లు ఎడిట్ చేసుకునే అవకాశం ఇవ్వగా ఆ ప్రక్రియ కూడా పూర్తయింది. రాత్రి లేదా సోమవారం పదోన్నతులు కల్పిస్తూ సంబంధిత విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం.

జిల్లాల వారీగా పదోన్నతులు..

మల్టీజోన్-1 పరిధిలో హనుమకొండ జిల్లాలో 43 మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించబోతున్నారు. ఇందులో పీఎస్‌హెచ్‌ఎం 11, ఎస్‌ఏ సోషల్ 16, ఎస్‌ఏ బయాలజికల్‌సైన్స్ 8, ఇంగ్లిష్ 7, ఫిజికల్ సైన్స్ ఒకటి ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 44, ములుగు జిల్లాలో 33, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో 34, మహబూబాబాద్ జిల్లాలో 60 మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు రానున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మల్టీజోన్-2 పరిధి జనగామ జిల్లాలో 43 మంది ఎస్‌జీటీలు పదోన్నతులు పొందబోతున్నారు.

ప్రాణహిత తగ్గుముఖం..

కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం 8.820మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. వరద దిగువన మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్దకు చేరి 4,06,510 క్యూసెక్కులు తరలివస్తోంది. మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, అన్నారం బరాజ్ వద్ద 8,147 క్యూసెక్కుల వరద వస్తోంది. బరాజ్‌లోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.

గంజాయి సేవిస్తూ.. పోలీసులకు చిక్కి

● ముగ్గురు యువకుల అరెస్ట్

హసన్‌పర్తి : గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులు ఆదివారం పోలీసులకు పట్టుబట్టారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఖానాపురానికి చెందిన పుల్లూరి రాజేశ్, పాపావత్ అనిల్, చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడేనికి చెందిన అల్వాల విపిన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. విధుల్లో భాగంగా ఎస్సై రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పెగడపల్లి సమీపంలోని చెట్ల పొదల మధ్య ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి వద్దకు వెళ్లగా గంజాయి సేవిస్తూ కనిపించారు. దీంతో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 50గ్రాముల గంజాయితోపాటు, రెండు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చెప్పారు. కాగా, తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిఘా ఉంచాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ పట్టుబడితే జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు.

సుబేదారి పీఎస్ పరిధిలో ఇద్దరు విక్రయదారులు..

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి సెయింట్ పాల్ పాఠశాల సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ఆపి విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేటకు చెందిన చౌలం దొరబాబు, కమలాపూర్‌కు చెందిన మంత్రి సంజయ్‌కుమార్ స్నేహితులు. వీరు తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మకాలు చేపడుతున్నారు. కాగా, దొరబాబు, కమల్ స్నేహితులు. కమల్ ఒడిశా నుంచి తక్కువ ధరకు గంజాయి తెచ్చి ఇవ్వడంతో దొరబాబు తన స్నేహితుడు సంజయ్‌కుమార్‌తో కలిసి సరుకును ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నాడు. దొరబాబు గదిలో రూ.23,500 విలువైన 880 గ్రాముల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బొగతలో పర్యాటకుల సందడి..



వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం పర్యాటకులను అబ్బురపరుస్తోంది. శనివారం సందర్శనను నిలిపివేసిన అధికారులు ఆదివారం అనుమతించారు. దీంతో జలపాతం అందాలను తిలకించడానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. బొగత వద్ద వరద ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో నీటిలోకి అనుమతించ లేదు.